# ఈ వారం కథ




పచ్చి మామిడాకుల వాసనా, విచ్చుకున్న మల్లెపూల పరిమళమూ కలిసి పరిసరాల్ని అల్లుకున్నాయి.

పిల్లలు ఆడుకుంటూ అటూ ఇటూ పరిగెత్తుతున్నారు. పెళ్ళికొచ్చిన బంధువులతోపాటూ బయటి తాటాకుల పందిరికింద కూచున్నాను. మిగతావాళ్ళంతా పేకాడుకుంటున్నారు.

ఏదో పనున్నట్లుగా అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్న నీరజ వంటాడి చెయ్యి పట్టుకుని నా దగ్గరకు లాక్కొచ్చింది. మగపెళ్ళివాళ్ళు రాకముందే అప్పుడే పట్టుచీర కట్టుకుని పెత్తనం చలాయిస్తున్న నీరజ వైపు చూశాను.

"ఊరికే కూచున్నారుగా. కాసేపు వీడ్ని చూసుకోండి. అటూ ఇటూ పరిగెత్తి గొడవ చేస్తున్నాడీ వెధవ. కాఫీ తాగుతారా?" అడిగినంత వేగంగా అక్కడ్నించి వెళ్ళి, రెండు నిమిషాల్లో కాఫీ గ్లాసుతో వచ్చింది నీరజ.

ఫిబ్రవరి నెల చలిగాలి హృదయాన్ని కూడా జల్లుమనిపిస్తోంది.

"ఎలా వుందండీ చీర?" కాఫీ తాగుతున్న నన్నడిగింది నీరజ.

గత ఎనిమిదేళ్ళుగా చెబుతున్నట్లుగానే "బాగుందోయ్" అన్నాను.

"మగపెళ్ళి వాళ్ళు ఇంకాసేపట్లో వచ్చేస్తారు. అవునూ, కాసేపు నిద్రపోతారా? రాత్రంతా ప్రయాణం చేసొచ్చారుగా" అంది.

"ఫర్వాలేదులే" అన్నాను.

"ఇప్పుడే వస్తా" చెప్పి అక్కడ్నించి కదిలింది.

నీరజ చెల్లెలి పెళ్ళి. పిల్లల్ని తీసుకుని వారం ముందే వచ్చింది నీరజ. నేను మాత్రం ఇందాకే వచ్చాను. నా కెందుకో పెళ్ళిళ్ళకి హాజరవాలనిపించదు. ఆ వాతావరణం, ఆ హడావుడీ, మామిడి తోరణాల, కొబ్బరి, తాటాకుల పచ్చి వాసనా, కొత్త సున్నం, లేత గంధం, మల్లెపూలూ కలగలిపిన పరిమళం - లోపలెక్కడో నాలుగు గదుల గుండెలో ఏ మూలో గొయ్యి తవ్వి పూడ్చిన ఏ సంగతుల్నో, ఏ జ్ఞాపకాల్నో తవ్వి తీసి, ముందు నిలిపి, నరాల్ని జివ్వున లాగే - ఈ వాతావరణంలో నేను ఇమడలేను.

దక్షిణపుగాలికి పందిరి చుట్టూ కట్టిన మామిడాకులు గలగలమని శబ్దంచేస్తున్నాయి. గాలి అలల మీద తేలుతూ ఏదో పిట్ట అరుపు ఆ రొదలో కలిసి వీణ తీగెల ప్రకంపనలాగా హృదయాన్ని తాకింది.

ఎన్నో ఏళ్ళనాడు - సరిగ్గా ఇలాంటి ఫిబ్రవరి నెలలో ఒక పాతకాలపు డాబా ఇల్లు. పెళ్ళిపందిరి. మల్లెపూలు. లతలాంటి మాలతి. జీవితాన్ని మలుపుతిప్పే గాదిలో, చట్రంలో పడేసిన ఒకానొక క్షణం. అన్నీ కలిసి కళ్ళ ముందు 'పెంటిక్స్'లాగా కనిపించబోతుండగా చప్పున అక్కడ్నించి లేచాను.

నీరజ దగ్గరకి నడిచి "కాసేపు పడుకుంటాను" అన్నాను.

"మేడ మీది గదిలో పడుకోండి అల్లుడుగారూ" అంటున్న మామగారి మాటల్ని తప్పించుకుంటూ నీరజ వెనకాలే మేడ మీదికెళ్ళాను.

రాత్రంతా దూరప్రయాణం చేసిరావడంతో ఇందాకటి దాకా కళ్ళు మాత్రమే మండాయి. కానీ ఊగే కిటికీ రెక్కని తెరుచుకుని లోపలికొచ్చే చల్లగాలినీ, మల్లెపూల పరిమళాన్నీ, బార్లా తెరచిన తలుపులతో పిడికెడు గుండె తపించే చేతులతో లోపలికి లాక్కోవడంతో లోపల కూడా ఏదో దహించసాగింది.

నీరజ వెళ్తూ వెళ్తూ మూసిన తలుపు వంక చూశాను.

సరిగ్గా పదేళ్ళ క్రిందట. ఇలాగే ఒకానొక పాతకాలపు మేడ మీది గదిలో, బయట్నుంచి వినిపించే మేళతాళాల్ని భరించలేని స్థితిలో - నాలో నేనే - నా దుఃఖంలో - దిగులులో నిండా మునిగి ఏం చెయ్యాలో? నా కెంతో ప్రియమైన వ్యక్తిని పోగొట్టుకునే చివరి క్షణాల్ని ఈ కళ్ళతో ఎలా చూడాలో తెలీని తపనతో, దుఃఖంతో సరిగ్గా ఇలాగే గడిపిన క్షణాల విషాదం పీల్చే గాలిలో కలిసి, రక్తంలో మిళితమైంది. మర్చిపోవాలని ఎంతగానో ప్రయత్నించే నన్ను అనుక్షణమూ ముందు నిలిచి ఏడిపించడమేగా జీవితం అంటే. మనసు గతంలోకి పరుగుదీసింది.

పదేళ్ళ క్రిందటి ఆ రోజు. రాత్రి పది గంటలు. కాల్చే నిరాశా స్వప్నాలతో కిటికీ చువ్వల్ని పట్టుకుని చీకట్లోకి చూస్తూ నిలబడ్డాను. ప్రాణంలాగా ప్రేమించిన ఇంటివాళ్ళమ్మాయి మాలతి ఆ తెల్లవారుజామున మరొకరి భార్యగా మారబోతోంది. నా చేతకానితనాన్ని, భయంతో, అసమర్థతతో కుంచించుకుపోయిన ప్రేమనీ, హృదయాన్నీ తిట్టుకుంటున్న క్షణంలో తలుపు తట్టిన శబ్దం.

నిరాశ నిండిన కళ్ళతో తలుపు తీస్తే వాకిట్లోనే నిలబడి వున్న మాలతి లోపలికొచ్చి తలుపు మూసింది.

ఆశ్చర్యం, భయం నిండిన కళ్ళతో, గొంతుతో "మాలతీ... నువ్వు... ఇప్పుడు" అన్నాను.

గదిలోని పాతిక క్యాండిల్ దీపం మెర్క్యురీలాంప్‌లా వెలగసాగింది.

కంచిపట్టు పెళ్ళి చీరలో నిలువెల్లా నగలతో, బుగ్గన చుక్కతో... పెళ్ళికూతురి అలంకరణతో... మాలతి. కాటుక పులిమిన కళ్ళు నీళ్ళతో నిండిపోగా నన్నే చూసింది.

"ఇంక నేను ఆపుకోలేను. నువ్వు లేని బ్రతుకు నాకొద్దు. ఇంకెవర్నీ లెక్కచేయను. నన్ను తీసుకుని... ఎక్కడికైనా వెళ్ళిపో... ప్లీజ్..." ఆవేశంగా అంటున్న ఆమె మాటలు నా లోపల శతఘ్నుల్ని పేల్చాయి.

"మాలతీ... తప్పు... అలా అనొచ్చా" అంటున్నాను.

చప్పున తలెత్తి "అంతేనా? ధైర్యం చెయ్యలేవా? నువ్వు 'ఊ' అంటే ఇప్పుడే ఎటైనా వెళ్ళిపోదాం. సమాధానం చెప్పు" సూటిగా చూస్తూ అడిగింది మాలతి.

అప్పుడు నా ఇరవై రెండేళ్ళ వయసు ముందు నిలిచి భయపెడుతున్న జీవితం, ధైర్యం చేయలేని స్థితిగతులూ, పరిస్థితులూ ఊగిసలాడబోయిన హృదయాన్ని తుంగలో తొక్కాయి.

నన్ను అర్థంచేసుకున్నట్లుగా "సరే. నీ ఇష్టం. తెల్లవారుజామునే పెళ్ళి. ఆశీర్వదిస్తావా?" నిర్లిప్తంగా అడిగింది.

శంఖంలాంటి మెడ క్రింద కాసేపటి క్రితమే పూసిన గంధం దిగులుగా నిట్టూరుస్తూ, ఎండిపోయి రాలిపోవడం కనిపిస్తోంది. మాలతి చేతులు నా మెడ చుట్టూ, నా చేతులు ఆమె నడుం చుట్టూ అలాగే చుట్టుకునే వున్నాయి.

ఉన్నట్టుండి మనసులో ఏదో కదిలినట్లుగా గట్టిగా కౌగిలించుకుంది మాలతి. ఇందాక కోపంతో, ఆవేశంతో ఎగిరిపడిన ఆమె వక్షస్థలం దళసరి పట్టుచీరలోంచి ఛేదించుకుని నా రొమ్ముకి మెత్తగా తగలడం స్పష్టంగా తెలుస్తోంది.

మెడవొంపులో ముఖాన్ని నిలిపి, లేత పెదవులతో, వెచ్చటి ఊపిరితో, దుఃఖంతోపాటు తెలీని తపనని కూడా నాలో రగిలిస్తూ

"నిన్ను తప్పు పట్టడం లేదు. నీ పరిస్థితులు నాకు తెల్సు. కానీ... కానీ... ఇన్నాళ్ళ మన ప్రేమ మనకంటూ మిగిల్చేది ఒక స్పర్శ, ఒక చూపు, ఒక నవ్వేనా? ప్రేమకి గమ్యం, పరాకాష్ఠ కలయిక అంటారుగా. తెల్లారితే పరాధీనని. ప్లీజ్. జారిపోయే క్షణాలు తిరిగి రావు. కనీసం ఒక్క అనుభవాన్నైనా మిగుల్చుకోనీ, నీ దుఃఖాన్ని కాస్తయినా ఉపశమింపచేట్లు చేయనీ..." అంటూ నా మెడ వొంపులో పెదవులానించి ముద్దు పెట్టుకోసాగింది.

నా చేతులు అప్పటికే ఆమె చుట్టూ ఆర్తిగా పెనవేసుకుని ఉన్నాయి.

నా మీద నాకే జాలేసింది. మాలతిలాంటి స్త్రీని శాశ్వతంగా కోల్పోతున్న నా బ్రతుకు నా ముందు నిలిచి దీనంగా ప్రాధేయపడుతున్నట్లుగా అనిపించింది. బంధనాల్లో, బాధ్యతల్లో బందీ అయిన ధైర్యం చేయలేని నా హృదయం మీద అసహ్యం వేసింది.

ఆమె వైపు... ఆ పెదవుల వైపు - సంధ్యాకాశంలా దిగులుకలిగించే ఆమె నుదిటివైపు చూశాను.

కోరికని దుఃఖం డామినేట్ చేస్తోంది.

ముందుకి వొంగి నుదిటిమీద పాపిట్లో ప్రేమనిండిన పెదవుల్ని ఆనించి మృదువుగా ముద్దుపెట్టుకున్నాను.

నా స్పర్శతో కళ్ళు తెరిచిన మాలతి ఆశాభంగం చెందినట్లుగా నా వైపు చూసింది.

నా వేలికున్న ఉంగరాన్ని తీసి ఆమెవేలికి తొడిగాను.

మౌనంగా అక్కడ్నించి కదిలి "వెళ్తున్నాను" అంటూ రెండడుగులు వెనక్కి వేసింది మాలతి.

అప్పుడొచ్చింది దుఃఖం

గదిలోంచీ, జీవితంలోంచి నిష్క్రమించే మాలతిని చూస్తూ తట్టుకోలేనని తెలిపిన కన్నీటి చుక్క పరదాలాగా కళ్ళలో పరుచుకుంది.

దిగులు మసకలో ఆమెవైపే చూస్తున్నాను.

బయటకి నడవబోయిందల్లా ఒక్క క్షణం ఆగి రెండే రెండు అంగల్లో దగ్గరకొచ్చింది. గాజులు నిండిన చేతుల్తో ఒక్క ఉదుటున నా ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని నేను ఆలోచించే లోపలే నా పెదవుల్ని గాఢంగా ముద్దుపెట్టుకుంది.

మబ్బులు కమ్మిన చీకటి ఆకాశంలో మెరుపు మెరిసినట్లయింది.

మరుక్షణంలో గదిలోంచి గాలిలా వెళ్ళిపోయింది. మెరిసిన మెరుపు క్షణాలలో మాయమైంది.

అంతే ఇప్పుడెక్కడుందో ఆ మాలతి. పిల్లలూ... సంసారం... సరిగ్గా నాలాగే... ప్చ్... గతం ఎప్పుడూ ఘనమైందే.

నిద్రపట్టక అటూ ఇటూ దొర్లాను. ఇప్పుడే వస్తానన్న నీరజ ఎక్కడికెళ్ళింది?

ఇంతలో క్రింద నుంచి కోలాహలం వినిపించింది.

లేచి కిటికీలోంచి బయటకు చూశాను. మగపెళ్ళివారు వచ్చినట్లున్నారు. అంతా కొత్తవాళ్ళు... పట్టుచీరల సందడి.

నీరజా, మామగారూ, మిగతావాళ్ళు కంగారుపడుతూ రిసీవ్ చేసుకోవడం కనిపించింది.

కిటికీ చువ్వలు పట్టుకుని చూస్తున్నాను. నెమలి కంఠం రంగు పట్టుచీరలో అందరిలోకీ అందంగా, మరింత హుందాగా కనిపించిందొక స్త్రీ. ఆమె... ఆమె... అచ్చం మాలతిలాగా... కాదు... నిజంగా మాలతే.

గుండె క్షణం పాటు ఆగింది.

** ** **

రాత్రి విందు భోజనాలు అయ్యాయి. అర్ధరాత్రి దాటాక ముహూర్తం. కాలక్షేపం కోసం మళ్ళీ చతుర్ముఖ పారాయణం వేసుకున్నారు కొందరు. అప్పటిదాకా ఎవరితోనో మాట్లాడి సిగరెట్ వెలిగించాను. దూరంగా మేడమీంచి, మధ్యాహ్నం నేను గడిపిన గది పక్కనే వున్న గది ముందు నిలబడి తన వాళ్ళతో మాట్లాడుతోంది మాలతి.

"ఏమండీ... ఆవిడ తెలుసా మీకు" అంటూ లోపల్నుంచి వచ్చింది నీరజ.

పొగని బైటికి వదిలి, "ఎవరు" అన్నాను.

"ఆమేనండీ. మేడమీద నిలబడి వుందే. కంచి పట్టుచీర... కుంకుమ రంగు. ఆమె పెళ్ళికొడుకు వదినగారట. మీరు తెలుసని చెప్పింది ఇందాక. ఆమె పేరు మాలతట. వాళ్ళాయన ఏదో బ్యాంక్ ఆఫీసర్ అని కూడా చెప్పింది"

"ఆ గుర్తొచ్చింది. ఎప్పుడో పదేళ్ళ క్రితం" అనుకుంటాను.

"అప్పుడెప్పుడో చదువుకునే రోజుల్లో వాళ్ళింటి మేడ మీద అద్దెకున్నారటగా. నా కెప్పుడూ చెప్పలేదేం" అంది.

"చెప్పలేదా?" ఆలోచిస్తున్నట్టుగా ముఖం పెట్టాను.

"సరే... సరే... మీ కన్నీ మతిమరుపే. నేను మీ పెళ్ళాన్ని. గుర్తున్నానా?" అంటూ నవ్వింది. "సిగరెట్ తాగుతున్నారుగా హాయిగా మధ్యలో నేనెందుకూ" చెప్పి అక్కడ్నించి కదిలింది.

తలెత్తి చూశాను. పిట్టగోడని పట్టుకుని నిలబడిన మాలతి నన్నే చూస్తోంది. పదేళ్ళ క్రిందట ఆనాటి రాత్రికన్నా మరింత అందంగా, ఆకర్షణీయంగా మారిన మాలతి. రొటీన్ జీవితానికి అలవాటు పడిపోయిన హృదయాన్ని, ఆలోచనల్ని తియ్యగా కాల్చడం మొదలు పెట్టింది.

ఆ రోజు నేనెంత పిచ్చిపని చేశానో, ఎంత వెర్రివాడిలా ప్రవర్తించానో ఇప్పుడు అర్థమవుతోంది. కౌగిట్లో వచ్చి వాలిన పున్నమి వెన్నెల్ని సాంతం అనుభవించకుండా ఎప్పుడో వచ్చే అమావాస్య చీకటిని తల్చుకుని భయపడి, సౌందర్య రసాస్వాదనకు అంధుడనై విలువల్ని పట్టుకుని వేలాడింది నేనేనా? అనిపించింది.

** ** **

ముహూర్తం దగ్గర పడింది.

పెళ్ళి పందిరి కిటికిటలాడి పోతోంది.

నేను ఓ పక్కగా కూచొని నీరజ బాబాయ్ మాటలు వింటూ మాలతికోసం వెతుకుతున్నాను. పందిట్లో తిరుగుతూ అజమాయిషీ చేస్తోంది నీరజ.

అర్ధరాత్రి కావడంతో చలిగాలి వాచి కొడుతోంది.

సరిగ్గా అప్పుడు ఆడవాళ్ళ మధ్య నుంచి లేచిన మాలతి అందంగా నడుచుకుంటూ అందర్నీ తప్పించుకుని నా వైపు రాసాగింది. గుండె జల్లుమంది.

అలాగే వచ్చి నా పక్క నుండి నడిచి, మేడ మెట్ల వైపు వెళ్తూ వెనక్కి తిరిగి నా వైపు ఓసారి చూసింది. అంతా ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు. పురోహితుడు అక్షింతలు పంచుతున్నాడు.

తలతిప్పి మేడవైపు చూశాను. నా గది పక్కనే విడిదిగా ఇచ్చిన ఒక గది ముందు నిలబడి నన్నే చూస్తూ అలాగే లోపలికెళ్ళింది మాలతి. ఆ చూపు నా గుండెని పట్టుకుని ఎక్కడికో లాగింది. నిలువలేక పోయాను.

ఒక్క క్షణం ఆగి నేను కూడా మేడవైపు నడిచాను. నన్నెవరూ గమనించడం లేదు. అలాగే వెళ్ళి ఏదో పనున్నట్టుగా నా గదిలోకి నడిచాను. లోపలున్న మల్లెపూల బుట్టల్నుంచి నరాల్ని జివ్వనిపించే పరిమళం బయటకొస్తోంది.

పదేళ్ళ కాలం ఒక వ్యక్తి హృదయాన్ని, భావాన్ని, నియమాల్ని, ఆలోచనల్నీ పూర్తిగా మార్చివేస్తుందే మోనన్న విషయం నాకు తెలియదు.

ఇప్పుడో - మరు క్షణంలోనో పక్కనే గదిలో వున్న మాలతి నా ముందుకొచ్చి నిలబడుతుందని గట్టిగా అనిపించింది.

ఓరగా తలుపు చప్పుడయింది. ఊపిరి బిగపట్టాను. సన్నాయిమేళం, మంత్రోచ్చాటనతో కలిసిన గాలితోపాటే లోపలికొచ్చింది మాలతి.

మగత నిద్రలో మర్చిపోయిన మధురస్వప్నం మళ్ళీ కళ్ళముందు నిలబడినట్లయి అలాగే చూస్తూ నిలబడిపోయాను. తలుపుని దగ్గరగావేసి ముందుకొచ్చింది.

అవే కళ్ళు. అమృతాన్ని నింపుకున్న అవే పెదవులు. నీలాకాశంలో దూది పింజల్లా భారంగా కదిలే మబ్బుల్లాంటి... ఆమె గుండెలు... అన్నీ అవే... కానీ... శంఖంలా పచ్చగా మెరిసే ఆమె కంఠాన్ని నల్లపూసల గొలుసు అంటిపెట్టుకుని వెక్కిరించింది.

"బావున్నావా? చిత్రంగా కలిశాం కదూ" అంది దగ్గరకొచ్చి.

"మాలతీ... నువ్వు...నమ్మలేక పోయాను" మాటలు రానట్లుగా ఆమెనే చూస్తూ నిలబడిపోయాను.

"నేనడిగానని మీ ఆవిడ చెప్పిందా? నువ్వేమీ మారలేదు. అదే నాలుకం. అప్పుడెలా వున్నావో ఇప్పుడు కూడా అలాగే వున్నావ్. బుద్ధావతారం లాగా" చిలిపిగా అంటూ చెంప నిమిరింది మాలతి.

గాజులతో గలగల లాడిన ఆ స్పర్శ నిద్రాణమై పోయిన ఎప్పటి తీరని వాంఛనో నిద్రలేపింది.

ఇన్నేళ్ళ తరువాత మళ్ళీ కనిపించిన మాలతి ఇందాక మేడ మీది నిలబడి నావైపే చూసిన చూపులోని అర్థం, ఏనాటి సంగతో నీరజ ద్వారా గుర్తు చేసిన వైనం. పెళ్ళి పందట్లో లేచి ఎవరూలేని ఏకాంత ప్రదేశంలో... నేనొస్తానని ముందే తెలుసుకున్నట్టుగా ఇక్కడికొచ్చిన మాలతిని. .. నేనిప్పుడేం చెయ్యాలి?

'ఊ... కానీయ్. ఆనాటి ఆమె తన హృదయాన్ని నీముందుపరిచింది. నీకప్పుడు ధైర్యం లేకపోయింది. మళ్ళీ ఇప్పుడు నీ ముందు నిలిచి దోసిట్లో చందమామలాగా చూస్తోంది. పదేళ్ళ కాలం నీలో ఏ మార్పూ తేలేదా? ఉట్టి బుద్ధావతారానివేనా?' అంటోంది హృదయం.

జీవితంలో చేజారిపోయిన కొన్ని మధురక్షణాల్ని మళ్ళీ ముందునిలిపి పరీక్షించేవిధి. నా కోసమే ఈ ఏకాంతాన్ని ఈ అవకాశాన్ని ఇచ్చిందా?

ఏదో మాట్లాడబోతున్న మాలతిని సరిగా రెండే రెండు అడుగుల దూరంలోని ఆమెని రెండు చేతుల్తో చుట్టేసి బలంగా దగ్గరికి లాక్కున్నాను. ఆమె చుట్టూ చేతులేసి నాలోకి అదుముకున్నాను. కరిమబ్బుని, దూదిపింజని కౌగిలించుకున్నట్లుగానే అనిపించింది. ఏదో మైకంలోకి, వేరే లోకంలోకి వెళ్ళిపోతున్నాను.

ఒక్కసారిగా నా చెంప ఛెళ్ళుమంది. చప్పున ఆమెని వదిలేశాను. జరిగింది అర్థం కానట్లుగా బిక్క మొఖంతో తలెత్తి ఆమెవైపు చూశాను.

నిర్లిప్తంగా చూస్తూ తన వేలికి పదేళ్ళ క్రిందట నేను తొడిగిన ఉంగరాన్ని తీసి నా చేతిలో వుంచింది.

"నిన్ను పిల్చిందీ, కలిసిందీ 'అందుకు'కాదు. ఆ రోజు నువ్వు 'గౌతమ బుద్ధుడి' లాగా నిలబడిన రోజు నాకిచ్చిన ఈ ఉంగరాన్ని ఈ పదేళ్ళూ భరించాను. అనుకోకుండా నీ భార్యని కలిశాను. ఈ ఉంగరం ఉండాల్సింది ఆమె వేలికి. అర్థమైందా? ఇది నీకివ్వాలని నిన్ను పిల్చాను. నువ్వింకా ఆనాటి బుద్ధావతారంగానే ఉన్నావని గర్వపడ్డాను. నువ్వు కూడా మామూలు మనిషిగా అందరు మగాళ్ళ లాగా మారిపోయావనుకోలేదు. గుడ్‌బై"

చెప్పిగదిలోంచి వెళ్ళిపోయింది మాలతి.

నా చేతిలో ఎన్నో ఏళ్ళ క్రిందట మాలతికిచ్చిన ఉంగరం మర్చిపోలేని కఠినమైన జ్ఞాపకంలా, నిద్రపోయే జీవితపు తోటలోకి రెక్కలు కొట్టుకుంటూ వచ్చిన దూరపు పాటలాగా గుచ్చుకుంటోంది.

ఇంతలో మళ్ళీ తలుపు చప్పుడయింది.

"ఏమండీ. ఏం చేస్తున్నారిక్కడ. మనిద్దరం తాంబూలాలు తీసుకోవాలట రండీ" లోపలికి తొంగిచూసి అంది నీరజ.